సాక్షి
చిత్తూరు
సోమవారం। 5। ఆగస్టు। 2024



### బోయకొండ కిటకిట

పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిట లాడింది. - 8లో



### జిల్లా సమగ్రాభివృద్ధికి పోరాటం

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ ప్రకటించారు. - 8లో



### 42 'ఎర్ర' దుంగలు స్వాధీనం

పిళ్లారికుప్పం సమీపంలో 42 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజ కుల్లాయప్ప తెలిపారు. - 8లో

విద్యతో సమాజంలోని అసమానతలను రూపుమాపవచ్చు.. పేద బతుకులను ఉన్నతంగా తీర్చిదిద్దవచ్చు.. తద్వారా దేశపురోభివృద్ధికి దోహదపడవచ్చు.. ఇదే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ అమలు చేసింది. సర్కారు బడులను అద్భుతంగా సిద్ధం చేసే మహాయజ్ఞం తలపెట్టింది. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రైవేటు పాఠశాల్లో చేరిన విద్యార్థులు సైతం ప్రభుత్వ పాఠశాలల వైపు మళ్లారు. అయితే ఈ మహోన్నత కార్యక్రమం పూర్తికాకముందే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వెంటనే గత ప్రభుత్వం చేసిన మంచి పనులను సైతం పక్కన పెట్టేసింది. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం వహించింది. నిరుపేద పిల్లలపై కక్షగట్టింది. అవసరాలకు తగ్గట్టు ఉపాధ్యాయులను నియమించకుండా పాఠ్యాంశాల బోధన దూరం చేసింది. నాణ్యత లేని ఆహారం వడ్డిస్తూ పగ తీర్చుకుంటోంది. చివరకు విద్యాకానుకను సైతం పూర్తిస్థాయిలో పంపిణీ చేయకుండా దగా చేస్తోంది. విద్యార్థుల భవిష్యత్తుపై నీళ్లు చల్లుతోంది.







పలమనేరు బాలుర హైస్కూల్‌లో ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకున్న విద్యార్థులు

# చతికిల బడి

కూటమి పాలనలో విద్యారంగం తిరోగమనం

- ప్రభుత్వ స్కూళ్లలో తిష్ట వేసిన సమస్యలు
- ఉపాధ్యాయుల కొరతతో నష్టపోతున్న విద్యార్థులు
- టీచర్ల సర్దుబాటుతో నెట్టుకొస్తున్న కూటమి ప్రభుత్వం
- కొత్తగా చేరిన విద్యార్థులకు లేని యూనిఫాం

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలు 1907, ప్రాథమికోన్నత పాఠశాలలు 206, ఉన్నత పాఠశాలలు 355 పాఠశాలలున్నాయి. ప్రభుత్వ స్కూళ్లలో ఒకటి నుంచి పదవ తరగతి వరకు 1,51,266 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో ప్రభుత్వ బడులను చంద్రబాబునాయుడు తన పాలనలో నిర్వీర్యం చేయడంతో చాలామంది పేదింటి పిల్లలు చదువుకు దూరమయ్యారు. సరిపడినంత మంది విద్యార్థులు లేరనే సాకుతో 2014–19 మధ్యలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు వెయ్యికి పైగా బడులను మూసి వేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను సైతం విద్యాసంవత్సరం ముగిసిపోతున్నా పూర్తిస్థాయిలో ఇవ్వలేకపోయింది. పేద పిల్లల కోసం ప్రవేశపెట్టిన మధ్యాహ్నభోజనాన్ని నాణ్యత లేకుండా చేసింది. తన వర్గంగా భావించిన ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రయోజనం చేకూర్చేలా చేశారు.

**గత ఐదేళ్లలో బడి తెరచిన రోజే విద్యాకానుక**

జిల్లా వ్యాప్తంగా గత నాలుగేళ్లలో 'జగనన్న విద్యాకానుక'ను బడి తెరచిన మొదటి రోజే విద్యార్థులకు అందజేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చింది. తల్లిదండ్రులకు ఎలాంటి ఆర్థిక భారం పడరాదనే లక్ష్యంతో 'జగనన్న విద్యా కానుక' (జేవీకే)ను 2020–21 విద్యా సంవత్సరం నుంచి తీసుకొచ్చింది. ఈ విద్యార్థులు కార్పొరేట్ స్కూల్ విద్యార్థులకు సమానంగా ఆత్మవిశ్వాసంతో బడికి వెళ్లాలని రూ.2,900 విలువైన కిట్‌లో నాణ్యమైన స్కూలు బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, జత బూట్లు, రెండు జతల సాక్సులు, వర్క్‌బుక్స్ (ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు), ఇంగ్లిష్–తెలుగు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ(హైస్కూల్), డిక్షనరీ, మూడు జతల యూనిఫాం క్లాత్, బెల్టు, టై అందజేసింది. జిల్లాలో 2020–21లో 1,79,025 మందికి రూ.2740.9 లక్షలు, 2021–22లో 1,84,138 మంది విద్యార్థులకు రూ.3178.2, అలాగే 2022–23లో 1,69,087 మందికి రూ.3320.87 లక్షలు, 2023–24లో 1,67,154 మందికి రూ.4178.9 లక్షలు గత ప్రభుత్వం ఖర్చు చేసింది.

### వైఎస్సార్‌సీపీ హయాంలో స్కూళ్లకు మహర్దశ

జిల్లా వ్యాప్తంగా 2019–2024 వరకు వైఎస్సార్‌సీపీ పరిపాలనలో ప్రభుత్వ స్కూళ్లకు మహర్దశ ప్రాప్తించింది. పేదింటి పిల్లలు ప్రపంచంతో పోటీ పడాలని పలు సంస్కరణలు అమలు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ స్కూళ్లకు, విద్యాభివృద్ధికి రూ.2,459 కోట్లకు పైగా ఖర్చు చేసింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 743 ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో నాడు–నేడు మొదటి దశ పనులు చేపట్టారు. రూ.182.48 కోట్లతో నాడు–నేడు మొదటి దశ పనులను పూర్తి చేశారు. బడులు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందజేశారు. ప్రతి ఏటా జూన్‌లో 'అమ్మఒడి' సాయం నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సంక్షేమ పథకాలతో 2019కు ముందు పడిపోయిన ప్రభుత్వ స్కూళ్లు ఆ తర్వాత పుంజుకున్నాయి. గణనీయంగా విద్యార్థుల సంఖ్య పెరిగింది.

### తగ్గిన రుచి

ప్రభుత్వ స్కూళ్లలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'జగనన్న గోరుముద్ద' పథకాన్ని నాణ్యతాప్రమాణాలతో అమలు చేసింది. విద్యార్థులకు రుచికరంగా, పౌష్టికాహారాన్ని అందించింది. కూటమి పాలనలో నాణ్యత ప్రమాణాలు పడిపోయాయనే విమర్శలొస్తున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి ప్రభుత్వం 'డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం' పథకం పేరిట అమలు చేస్తోంది. పథకం పేరు మార్చడంలో ఉన్న శ్రద్ధ అమలు విషయంలో లేదనే విమర్శలొస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లలో 1,44,500 మంది విద్యార్థులకు గాను 1,33,627 మంది మధ్యాహ్న భోజనం తింటున్నారు. మిగిలిన 10,873 మంది విద్యార్థులు భోజనం బడుల్లో తినడం లేదు. ఇందులో ఎక్కువగా ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 9017 మంది మధ్యాహ్న భోజనం తినడం లేదని అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి.

### ప్రభుత్వ స్కూళ్లపై వివక్ష

గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. విద్యార్థులు, టీచర్లకు కనీస మౌలిక వసతులు ఉండేవి కావు. ఫలితంగా అప్పట్లో వివిధ కారణాలతో మూతబడిన స్కూళ్లు ఎన్నో ఉన్నాయి. బడులు తెరచి రెండు నెలలు పూర్తవుతోంది. పలు స్కూళ్లలో టీచర్ల కొరత వేధిస్తోంది.

### విద్యార్థుల వివరాలు

| మేనేజ్‌మెంట్ | ప్రాథమిక | ప్రాథమికోన్నత | ఉన్నత | మొత్తం |
|---|---|---|---|---|
| రాష్ట్ర ప్రభుత్వ | 353 | 331 | 6491 | 7175 |
| ఎంపీపీ, జెడ్పీ | 49,007 | 11,127 | 66,327 | 1,26,461 |
| మున్సిపల్ | 1,927 | 749 | 4,143 | 6,819 |
| ఆదర్శ పాఠశాలలు | - | - | 2,492 | 2,492 |
| కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు | - | - | 1,582 | 1,582 |
| ఏపీ రెసిడెన్షియల్ | - | - | 1,489 | 1,489 |
| సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు | - | - | 2,998 | 2,998 |
| గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు | - | - | 588 | 588 |
| గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల | - | - | 107 | 107 |
| ఎయిడెడ్ | 521 | - | 1,034 | 1,555 |
| మొత్తం | 51,808 | 12,207 | 87,251 | 1,51,266 |

### వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జేవీకే కిట్ల పంపిణీ వివరాలు

| సంవత్సరం | లబ్ధిపొందిన విద్యార్థులు | ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం (రూ.లక్షల్లో) |
|---|---|---|
| 2020–21 | 1,79,025 | 2740.9 |
| 2021–22 | 1,84,138 | 3178.2 |
| 2022–23 | 1,69,087 | 3320.8 |
| 2023–24 | 1,67,154 | 4178.9 |
| మొత్తం | 6,99,404 | 13,418.8 |

### జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్ల వివరాలు

| మేనేజ్‌మెంట్ | ప్రాథమిక | ప్రాథమికోన్నత | ఉన్నత | మొత్తం |
|---|---|---|---|---|
| రాష్ట్ర ప్రభుత్వ | 14 | 05 | 15 | 34 |
| ఎంపీపీ, జెడ్పీ | 1,852 | 194 | 291 | 2,337 |
| మున్సిపల్ | 36 | 07 | 10 | 53 |
| మోడల్ స్కూల్స్ | - | - | 07 | 07 |
| కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు | - | - | 08 | 08 |
| గురుకుల పాఠశాలలు | - | - | 05 | 05 |
| సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు | - | - | 08 | 08 |
| గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు | - | - | 04 | 04 |
| ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల | - | - | 01 | 01 |
| ఎయిడెడ్ | 05 | - | 06 | 11 |
| మొత్తం | 1,907 | 206 | 355 | 2,468 |

**జిల్లా కేంద్రంలో చూస్తే..**

జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలల్లో 380కు పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 100 మంది వరకు తమిళ మీడియం విద్యార్థులున్నారు. ఈ స్కూల్లో ప్రస్తుతం 28 మంది టీచర్లు పనిచేస్తున్నారు. మరో నలుగురు సబ్జెక్ట్ టీచర్ల కొరత ఇక్కడ ఉంటోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని సంతకం చేసిన చంద్రబాబు దీనిని మరింత జాప్యం చేస్తున్నారని పరిణామాలు తేటతెల్లం చేశాయి.



మధ్యాహ్న భోజనం సరిగా లేక తక్కువగా తింటున్న ఐరాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

### వేధిస్తున్న టీచర్ల కొరత

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులకు గాను 8,854 మంది వివిధ కేటగిరీల్లో టీచర్లు ఉండాలి. అయితే 7,945 మంది టీచర్లు మాత్రమే ఉన్నారు. 909 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో గణితం, బయాలజీ, సోషియల్, ఇంగ్లిష్, తెలుగు, హిందీ, ఉర్దూ, తమిళం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికంగా ఎస్జీటీ కేడర్‌లో 516, ఎస్జీటీ ఉర్దూలో 61 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికంగా ఎస్జీటీ టీచర్లు కొరత ఉండడంతో ప్రాథమిక విద్య మిథ్యగా మారింది.

### టోఫెల్ తరగతులకు కూటమి మంగళం

ప్రభుత్వ స్కూళ్లవిద్యార్థుల్లో ఇంగ్లిష్ ప్రావీణ్యం పెంపొందించాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం టోఫెల్ తరగతులు ప్రవేశపెట్టింది. ఇందు కోసం ప్రత్యేక పీరియడ్ కూడా కేటాయించింది. 3–5 తరగతుల వారి కోసం టోఫెల్ ప్రైమరీ, 6–9 తరగతుల వారి కోసం టోఫెల్ జూనియర్ క్లాసులు నిర్వహించి మార్చిలో పరీక్షలు కూడా నిర్వహించింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ పరీక్ష ఫలితాలు ప్రకటించకపోగా, ఏకంగా టోఫెల్ కోర్సుకే తిలోదకాలు ఇచ్చింది. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా 1,51,266 మంది విద్యార్థులు నష్టపోతున్నారు.

### అన్ని సబ్జెక్టులకు ఒకే ఉపాధ్యాయుడు!

జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లో సింగిల్ టీచర్లు ఉన్న స్కూళ్లు చాలా ఉన్నాయి. సింగిల్ టీచరే అయినా 1 నుంచి ఐదు తరగతులకు అన్ని సబ్జెక్టులూ చెప్పాల్సిందే. టీచర్ సెలవు పెడితే ఆ రోజు విద్యార్థులకు సెలవు రోజు కిందే లెక్క. ఎస్జీటీ టీచర్లు కొరత ఉండడం వల్ల సింగిల్ టీచర్లతో బడులు నెట్టుకొస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సింగిల్ టీచర్ల బడులు 1,046 ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అదేవిధంగా ఉన్నత పాఠశాలల్లోనూ సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. జిల్లాలోని పూతలపట్టు హైస్కూల్‌లో 580 మంది విద్యార్థులు చదువుతున్నారు. టీచర్లు 35 వరకు ఉండాలి. అయితే 28 మంది మాత్రమే ఉన్నారు. ప్రధాన సబ్జెక్టులైన ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులకు టీచర్లు లేరు. ఇదే పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో సైతం టీచర్ల కొరత ఎక్కువగా ఉంది. టీచర్ల సర్దుబాటు తప్పితే టీచర్ల నియామకాలకు పూనుకోవడం లేదని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు.

### ఆలస్యంగా పాఠ్యపుస్తకాలు ఇచ్చారు



పాఠ్యపుస్తకాలు ఆలస్యంగా ఇచ్చారు. గతంలో బడి తెరచిన మొదటి రోజే ఇచ్చేవారు. ఇప్పుడేమో ఆలస్యంగా అందజేశారు. కొన్ని పుస్తకాలు ఒకసారి, మరికొన్ని పుస్తకాలు ఇంకోసారి ఇచ్చారు. పుస్తకాలు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డాను. – రామ్‌చరణ్, పదవ తరగతి విద్యార్థి, పూతలపట్టు

### డిక్షనరీ ఇంకా ఇవ్వలేదు



డిక్షనరీ ఇంకా ఇవ్వలేదు. అవి ఇచ్చి ఉంటే మాకు ఎంతో ఉపయోగపడేది. బయట కొనుక్కుందామంటే డబ్బులెక్కువ. మా టీచర్లను అడగాలంటే భయంగా ఉంది. త్వరగా ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ పంపిణీ చేస్తే మాకెంతో మేలు. – పూజిత్, పదవ తరగతి విద్యార్థి, పూతలపట్టు

### మధ్యాహ్న భోజనం రుచి తక్కువ



మధ్యాహ్న భోజనం రుచి తక్కువగా ఉంది. సాంబార్ సరిగా ఉండడం లేదు. నేను కొన్నిసార్లు ఇంటి నుంచే తెచ్చుకుంటాను. నేను తొమ్మిదవ తరగతి చదివేటప్పుడు మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం బాగా పెట్టేవారు. అప్పటిలా ఇప్పుడు ఉండటం లేదు. నేను 8 వ తరగతి చదివేటప్పుడు ట్యాబ్ కూడా ఇచ్చారు. ఆ ట్యాబ్ నా చదువుకు ఎంతో ఉపయోగపడుతోంది. – అక్షయ, విద్యార్థిని. పి.కొత్తకోట, పూతలపట్టు

### టీచర్ల కొరత ఉంది



టీచర్ల కొరత ఉండడంతో సరిగ్గా చదుకోలేకపోతున్నాం. విద్యార్థులేమో ఎక్కువగా ఉన్నారు. ఒక్కోసారి ముఖ్యమైన సబ్జెక్టు టీచర్లు సెలవు పెడితే ఆ రోజంతా మాకు తరగతులు ఉండవు. అదనంగా టీచర్లు ఉంటే బాగుంటుంది. – చందనప్రియ, విద్యార్థిని, పి.కొత్తకోట, పూతలపట్టు

### పిల్లలకు సరిపోని షూస్



మా ఇద్దరి పిల్లలనూ ప్రభుత్వ స్కూల్లో చదివిస్తున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్కూళ్ల ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక పేరుతో పిల్లలకు బూట్లు, సాక్స్, బెల్టు, బ్యాగ్‌లు అందేవి. ఇప్పుడు స్కూళ్లు తెరచి రెండు నెలలవుతున్నా స్టూడెంట్ కిట్ల పేరుతో విద్యార్థులకు అరకొరగా ఇచ్చారు. మా పిల్లలకు ఇచ్చిన షూస్ పాదాలకు సరిపోని ఇచ్చారు. గతంలో నాణ్యమైనవి, సరిపడా కొలతలతో ఇచ్చేవాళ్లు కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. – అమరనాథ్, ఐరాల





టీచర్ల కొరత ఉన్న జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

### అరకొరగానే కానుక

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బడులు తెరిచే నాటికే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేసేది. కూటమి పాలనకొస్తే..జిల్లాలో 1 నుంచి పదవ తరగతి వరకు 31 మండలాల్లో 1,50,120 మంది విద్యార్థులకు కిట్లను అందజేశారు. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఇంకా ఇవ్వాల్సి ఉంది. పలు చోట్ల పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అరకొరగా అందజేశారు. అందజేసింది. ఇంటర్ విద్యార్థులకు రెండు రోజుల క్రితం పాఠ్యపుస్తకాలను సరఫరా చేయగా, ఒకేషనల్ విద్యార్థులకు ఇంత వరకు పంపిణీ చేయలేదు. 'ఇది మీకు నేను ఇస్తున్న వాగ్దానం' అని ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన నేపథ్యంలో పుస్తకాల పంపిణీలో కూడా 'తమ్ముళ్లు' భాగస్వాములవుతున్నారు. పంపిణీ ఆలస్యం అవడానికి ఇది కూడా ఓ కారణం. రెండు నెలలుగా విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ ప్రహసనంగా సాగుతోంది. ఈ నెలాఖరున ఫార్మేటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు ఉన్న నేపథ్యంలో విద్యార్థులు పుస్తకాల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా పుస్తకాల విషయంలో ప్రతిరోజూ విద్యార్థుల చేరికను బట్టి స్టాక్ ఉంచుకుని మిగిలిన వాటిని ఉన్నతాధికారులు సూచించిన స్కూళ్లకు తరలిస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థులకు వెంటనే ఇవ్వకుండా ఆయా ప్రాంతాల స్థానిక కూటమి నాయకులు వస్తేనే వారి చేతుల మీదుగా పంపిణీ చేస్తున్నారు.

పూతలపట్టు మండలం పి.కొత్తకోట జెడ్పీ హైస్కూల్‌లో కూర్చుని ఉన్న విద్యార్థులు



### నేడు కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

**చిత్తూరు కలెక్టరేట్ :** 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

## బస్సులో డ్యాన్స్ చేస్తూ చిత్తూరు విద్యార్థి మృతి

**తిరువొత్తియూరు:** తమిళనాడు రాష్ట్రం పళ్లికొండ టోల్‌గేట్ సమీపంలో టూర్ బస్సులో డ్యాన్స్ చేస్తున్న కళాశాల విద్యార్థి హఠాత్తుగా స్పృహతప్పి మృతి చెందాడు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాకు చెందిన సుధాకర్ కుమారుడు భాను ప్రకాష్ (19). ఇతను చిత్తూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. ఈ క్రమంలో కళాశాల నిర్వాహకులు తిరుపత్తూరు జిల్లా ఏలగిరికి పర్యటనకు వెళ్లడానికి టూర్ ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు శనివారం తెల్లవారుజామున చిత్తూరు నుంచి కళాశాల బస్సులో భాను ప్రకాష్ సహా 40 మంది విద్యార్థులు 10 మంది ఉపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాల్ బయలుదేరారు. ఏలగిరిలో పర్యటన ముగించుకొని శనివారం రాత్రి చిత్తూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. ఆ సమయంలో బస్సులో భానుప్రకాష్‌తో సహా కొందరు విద్యార్థులు ఉత్సాహంగా డ్యాన్స్ వేశారు. వేలూరు జిల్లా పళ్లికొండ టోల్‌గేట్ వద్ద బస్సు వస్తున్న సమయంలో డాన్స్ వేస్తున్న భాను ప్రకాష్ హఠాత్తుగా స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అంబులెన్స్‌లో గుడియాత్తం ప్రభుత్వ ఆసుపత్రికి భాను ప్రకాష్‌ను తరలించారు. అక్కడ పరిశీలించిన డాక్టర్లు భాను ప్రకాష్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గుండెపోటుకు గురై అతను మరణించినట్లు భావిస్తున్నారు.

## విజయవాడకు వెళ్లిన కలెక్టర్

**చిత్తూరు కలెక్టరేట్ :** రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు 5వ తేదీ సోమవారం విజయవాడలో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందడంతో ఆదివారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ బయలుదేరి వెళ్లారు. జిల్లాలో పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వివరాల నివేదికను ఆయన తీసుకెళ్లారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా వ్యవహరిస్తారు.

## నేడు పోలీస్ గ్రీవెన్స్ డే

**చిత్తూరు అర్బన్:** చిత్తూరులోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా తనను కలిసి నివేదించవచ్చని, ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## క్లుప్తంగా

### కుక్కల దాడిలో జింక మృతి



జింక కళేబరం

చిత్తూరు కార్పొరేషన్: కుక్కల దాడిలో జింక మృతి చెందిన సంఘటన ఆదివారం నగరంలోని అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎఫ్ఆర్వో థామస్ తెలిపిన వివరాలు..స్థానిక కార్తీకవనం నర్సరీ వెనుక వైపు ఉన్న అటవీ ప్రాంతం నుంచి నీటి కోసం జింక గంగినేని చెరువుకు వచ్చింది. కుక్కల గుంపు జింకను చూసి దాడి చేసి చంపేశాయి. సమాచారం అందుకున్న ఎఫ్ఆర్వో అక్కడికి వెళ్లి పరిశీలించారు. సోమవారం జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేస్తామని చెప్పారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



గాయపడిన శ్రీదేవి

పుంగనూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం సాయంత్రం పట్టణంలోని తూర్పు మొగశాలలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని లక్ష్మీపురం కాలనీకి చెందిన శ్రీదేవి (35) తన పనుల నిమిత్తం పుంగనూరుకు వచ్చింది. తూర్పుమొగశాల వద్ద కాలినడకన వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. గమనించిన స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆషాఢమాసం చివరి ఆదివారం పురస్కరించుకుని అమ్మవారి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో ముస్తాబుచేశారు. కోరిన ఫలించిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఈఓ ఏకాంబరం పర్యవేక్షించారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. - చౌడేపల్లె

# ఆధ్యాత్మికం.. బతుకు సార్థకం

తిరుపతి కల్చరల్ : ఆధ్యాత్మిక సాధనలో బతుకు సార్థకమవుతుందని రాజమహేంద్రవరం ఆశ్రమ స్వామి శశికాంతానంద తెలిపారు. ఆదివారం ఇస్కాన్ రోడ్డులోని శ్రీరామకృష్ణ ఆశ్రమ 9వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భక్త సమ్మేళనంలో శశికాంతానంద ప్రసంగించారు. ఉత్తమ శిష్యుడు మోక్ష మార్గం పొందుతాడని, భగవంతుడు ఇచ్చిన పని పూర్తి చేసే వాడు ఆదర్శ భక్తుడవుతాడన్నారు. గురువు చెప్పినవి ఆచరించేవారు ఉత్తమ భక్తుడని వెల్లడించారు. అనంతరం ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద, ఆచార్య పీవీ రెడ్డి, పి.భాస్కరరావు మాట్లాడుతూ వివిధ ఆధ్యాత్మిక విషయాలపై ఉపన్యసించారు. ఈ క్రమంలోనే ఆశ్రమంలో ధ్యానం, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. సాయంత్రం మాస్టర్ గోపి బృందం వారు భజనలు చేశారు. కార్యక్రమంలో స్వామి సత్వస్థానంద, జయచంద్రరెడ్డి, జీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న స్వామి శశికాంతానంద

# ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం

నగరి : స్వాతంత్ర దినోత్సవం, నగరి చెస్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా వీకేఆర్ పురం గ్రాండ్ వరల్డ్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాల నుంచి జూనియర్ విభాగంలో 126 మంది, సీనియర్ విభాగంలో 24 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి ఓ.బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పూర్వం రాజులు యుద్ధంలో ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థులను మట్టి కరిపించే వారని, ఆ విధానాల నుంచి పుట్టిందే చదరంగమన్నారు. అది క్రమేపీ క్రీడగా మారి విశ్వవ్యాప్తమైందని వివరించారు. ఈ క్రీడతో జ్ఞాపకశక్తి పెరుగుతుందని, విజ్ఞానం పెంపొందుతుందన్నారు. పుత్తూరు డిప్యూటీ డీఈవో, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ హెచ్ ప్రభాకర్ రాజు మాట్లాడుతూ 27 యేళ్ల క్రితం స్నేహితుల దినోత్సవం రోజు ఈ పోటీలను నగరిలో ప్రారంభించినట్టు తెలిపారు. నేడు అదే స్నేహితుల దినోత్సవం రోజున పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని వివరించారు. నగరి లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ మోహన్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన ఫైనల్స్ జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ చైర్‌పర్సన్ రామచంద్రారెడ్డి, జోన్ చైర్‌పర్సన్ శ్రీనివాసులు రెడ్డి, నగరి క్లబ్ ఉపాధ్యక్షుడు గజేంద్ర, సభ్యులు జీవన్, దేవన్, మహమ్మద్ షఫిక్, చదరంగపు క్రీడా శిక్షకులు నవీన్‌కుమార్, శివకేశవులు, నగరి చెస్ అసోసియేషన్ కార్యదర్శి కలీల్ బాషా, కన్వీనర్ సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఓ.బాలసుబ్రమణ్యం

# ఇసుకాసురుల టార్గెట్ పలమనేరు సీఐ!

- బదిలీ చేస్తే ఇసుక రవాణాకు అడ్డులేనట్లేనని కుయుక్తులు
- పక్కా వ్యూహంతోనే సీఐకు వ్యతిరేకంగా ఆరోపణలు
- బదిలీల్లో సీఐ పేరు లేకపోవడంతో తర్జనభర్జన

పలమనేరు: ఇసుకాసురులకు కంట్లో నలుసుగా మారిన పట్టణ సీఐ చంద్రశేఖర్ అడ్డు తొలగించుకోవాలనే కూటమి నేతల పన్నాగం ఫలించలేదు. సీఐని టార్గెట్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం ఆందోళనకు దిగి, ఆయనతో వాగ్వాదాలకు సైతం దిగిన విషయం తెలిసిందే. అయితే తాజాగా సీఐ బదిలీల జాబితాలో స్థానిక సీఐ పేరు లేకపోవడంతో కూటమిలోని స్థానిక ఇసుకాసురులకు మింగుడు పడడం లేదు. మరోవైపు కొంతకాలంగా భారీగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారంతా ఈ ధర్నాలో పాల్గొన్నారు. వీరందరినీ పోలీసులు స్మార్ట్‌ఫోన్లలో రికార్డు చేశారు. దీని ఆధారంగా కౌండిన్యలో ఇసుకను తరలించేవారు, ట్రాక్టర్ల యజమానులు, ఇందుకు సహకరించే నాయకులు, వారి సహాయకుల వివరాలను పోలీసులు శ్రమ లేకుండా తెలుసుకునే అవకాశం కలిగింది. ప్రస్తుత సీఐల బదిలీల్లో సీఐ పేరు లేకపోవడంతో ఇసుకాసురుల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టైంది. సీఐ టీడీపీకి వ్యతిరేకమంటూ డ్రామాలాడింది కేవలం ఆయన ఇసుక అక్రమరవాణాకు అడ్డుతగులున్నాడనే తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలో ఆదివారం కౌండిన్య నదిలో ఇసుక తవ్వకాలు పూర్తిగా ఆగిపోయాయి. సీఐ చంద్రశేఖర్ ఇక్కడ ఉన్నంత వరకూ తమ ఇసుకాటలు సాగే పరిస్థితులు లేవని, దీనికి మరో మార్గమేమైనా ఉందా? అని తర్జనభర్జన పడుతున్నట్టు తెలుస్తోంది.



# గురవారెడ్డి అక్రమ అరెస్టు దారుణం

- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు పోలీసులు దాసోహం
- కార్వేటినగరంలో వైఎస్సార్ సీపీ నేతల నిరసన



గురవారెడ్డిని అరెస్టు చేయడంతో సర్కిల్ కార్యాలయానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీరంగరాజపురం: మాజీ జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పిల్లారికుప్పం గురవారెడ్డి అక్రమ అరెస్టు చేయడం దారుణమని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలవుతున్నా కక్ష సాధింపుతో ఇప్పటికీ వైఎస్సార్ సీపీ నేతలు, సానుభూతిపరులపై దాడులు, అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయని మండిపడ్డారు. సరైన కారణాలు లేకుండా, ఎలాంటి ఫిర్యాదు లేకుండా అధికార పక్షం నాయకుల ఒత్తిడితో రాత్రికి రాత్రే గురవారెడ్డిపై కేసు నమోదు చేసి, సినీ ఫక్కీలో కార్వేటినగరం సర్కిల్ కార్యాలయానికి తరలించారు. దీంతో అక్కడికి చేరుకున్న నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు రోడ్డుపై బైఠాయించి అధికార పార్టీ వైఖరిని ఎండగట్టారు. అధికార పక్షం నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు అక్రమ కేసు బనాయించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ సభ్యుడి పదవికి రాజీనామా



చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తాను అదనపు బాధ్యతలుగా ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మెంబర్ పదవికి రాజీనామా చేసినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు.

### అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి క్రైమ్: తమిళనాడుకు చెందిన వ్యక్తి అప్పుల బాధ తాళలేక తిరుపతిలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు కాంచీపురానికి చెందిన సంపత్ కుమార్(51) తిరుపతి తదితర ప్రాంతాల్లో సెకండ్ హ్యాండ్ ద్విచక్ర వాహనాలను విక్రయించేవాడు. ఇదే క్రమంలో తిరుపతికి తరచూ వచ్చి వెళ్లేవాడు. ఈ నెల రెండో తేదీన అలిపిరి పరిధిలోని ఓ లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. అయితే రెండు రోజులైనా బయటకు రాకపోవడంతో ఆదివారం ఉదయం హోటల్ యాజమాన్యం అలిపిరి పోలీసులకు సమాచారం అందించారు. తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా.. అప్పటికే గుర్తు తెలియని విషం తీసుకొని మృతి చెందినట్లుగా పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిపై బంధువులకు సమాచారం అందించారు. సంపత్‌కుమార్‌కు చాలా అప్పులున్నాయని, దీంతోనే మృతి చెంది ఉంటాడని తెలిపారు.

### తిరుపతిలో కార్డన్ సెర్చ్

తిరుపతి క్రైమ్: అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిని శివజ్యోతినగర్‌లో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తిరుపతి డీఎస్పీ రవి మనోహరాచారి ఆధ్వర్యంలో 45 మంది అధికారులు సిబ్బందితో కలిపి అయ్యప్ప కాలనీ శివజ్యోతినగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించగా ఇందులో ఎలాంటి పత్రాలు లేని నాలుగు ఆటోలు, 31 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. సరైన పత్రాలు చూపించి వాహనాలను విడుదల చేసుకోవాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి పోరాటం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ ప్రకటించారు. ఆదివారం నగరంలో ఆ పార్టీ జిల్లా సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రజాసమస్యలపై పోరాడాలన్నారు. జిల్లాలో కేంద్ర విశ్వవిద్యాలయాలు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణ అపోలోకు కాకుండా వైద్యశాఖకు ఇవ్వాలని, హంద్రీ-నీవా, గాలేరు-నగరి కాలువలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ భూములను, క్వారీలను కబ్జా చేస్తున్న వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిప్పు పెట్టిన నిందితులను పట్టుకుని శిక్షించాలన్నారు. జిల్లాలో గ్రీన్ అంబాసిడర్లుగా పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ జీతాలు మంజూరు చేయాలన్నారు. తొలుత కేరళ రాష్ట్రంలో వరదల్లో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. సమావేశంలో తిరుపతి జిల్లా సీపీఐ కౌన్సిల్ సభ్యులు శ్రీరాములు, పార్టీ సీనియర్ నాయకులు మణి, జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, కోమల, రఘు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు

# డిగ్రీ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, నాలుగేళ్ల కాలంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిధిలోని డిగ్రీ అధ్యాపకుల సమస్యలను 90 శాతం వరకు పరిష్కరించినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా యూనివర్సిటీ స్థాయిలో పరిష్కారానికి నోచుకోని సమస్యలను తమ సంఘం పరిష్కరించినట్లు పేర్కొన్నారు. సీనియారిటీ సమస్య దశాబ్దాలుగా పరిష్కారం కాని పరిస్థితి ఉండేదని, ఆ సమస్యను తమ సంఘం ఆధ్వర్యంలో పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి డాక్టర్ వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ, కోవిడ్ ముందు నుంచి గాడితప్పిన అకడమిక్ క్యాలెండర్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ల సమస్యలు పరిష్కరించామన్నారు. ఎస్వీయూ సెక్రటరీ డాక్టర్ శంకరరెడ్డి మాట్లాడారు. పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా కోశాధికారి గురుమూర్తి, వివిధ కళాశాలల సంఘ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి



# మలిమేలుకండ్రిగ వద్ద రోడ్డు ప్రమాదం

- 12 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి తరలింపు

నాగలాపురం: మండలంలోని మలిమేలుకండ్రిగ సమీపంలో తిరుపతి చెన్నై జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తమిళనాడులోని తిరువళ్లూరు తాలూకా అమ్మయార్ కుప్పంకు చెందిన కొంత మంది మినీ బొలెరో వాహనంలో తమిళనాడులోని పెరియపాలయం అమ్మవారి ఆలయానికి వెళ్లి తిరుగు పయనమయ్యారు. మలిమేలుకండ్రిగ వద్ద రోడ్డు పక్కన ఆపి ఉన్న ఐషర్ వాహనాన్ని అదుపుతప్పిన బొలెరో వాహనం ఎదురుగా ఢీకొంది. రెండు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న 12 మందికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే నాగలాపురం, నింద్ర, పిచ్చాటూరు మండలాల నుండి 108 వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నగరి, పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. విషయం తెలుసుకున్న నాగలాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేస్తున్నారు.



గాయపడిన తమిళనాడు వ్యక్తి



వాహనానికి ముందు భాగంలో చిక్కుకున్న క్షతగాత్రుడు

# ప్రేమ పేరుతో మోసం

- పంచాయతీ కార్యదర్శి అరెస్టు

వరదయ్యపాళెం: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని యువతిని మోసం చేసిన కేసులో పంచాయతీ కార్యదర్శి గిరిబాబును వరదయ్యపాళెం పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సత్యవేడు సీఐ దివాకర్ రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. వరదయ్యపాళెం మండలంలోని సీఎల్ఎన్‌పల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం మిట్టహరిజనవాడకు చెందిన గిరిబాబు అయ్యవారిపాళెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. చెన్నైకు చెందిన సింధు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆమె మిట్టహరిజనవాడలోని తన అమ్మమ్మ ఇంటికి అప్పుడప్పుడు వచ్చి వెళ్లేది. అయితే వీరిద్దరికి ఏర్పడిన పరిచయం ప్రేమ వరకు దారి తీసింది. దీంతో ఇద్దరి మధ్య ఏర్పడిన ప్రేమ బంధం పెళ్లి వరకు వెళ్లింది. దీంతో ఈ ఏడాది జూన్ 26న పెద్దలు నిశ్చయించిన మేరకు సూళ్లూరుపేట ఆలయంలో వివాహం చేసుకునేందుకు నిర్ణయించి, పెళ్లిపత్రికలు సైతం పంచిపెట్టారు. అయితే వివాహాన్ని తప్పించుకోవడానికి పంచాయతీ కార్యదర్శి గిరిబాబు తన తల్లి సుబ్బమ్మ, అక్క లక్ష్మీ, బావ వెంకయ్యతో కలిసి పెళ్లి జరగాల్సిన జూన్ 26న పరారయ్యాడు. దీంతో యువతి సింధు తన కుటుంబ సభ్యులతో కలిసి అదే రోజున వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌లో తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. ఆదివారం మండలంలో తిరుగుతున్న గిరిబాబును అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. గిరిబాబు తల్లి సుబ్బమ్మ, అక్క లక్ష్మీ, బావ వెంకయ్యపై కూడా కేసు నమోదు చేశామని, వారు పరారీలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.




పంచాయతీ కార్యదర్శి గిరిబాబును అరెస్టు చూపుతున్న వరదయ్యపాళెం పోలీసులు

### నలుగురిపై కేసు నమోదు

ఏర్పేడు: మతమార్పిడి చేసుకోవాలని మండలంలోని మునగలపాలెంలో ఓ కుటుంబాన్ని బెదిరించిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు ఆదివారం తెలిపారు. మండలంలోని మునగలపాలెంకు చెందిన పెమ్మసాని వెంకటరమణ భార్య మాధురిని రేణిగుంటలోని శ్యామ్యూల్, రెడ్డిలక్ష్మి, నాగభూషణమ్మ, యశోద వారి ఇంటికి వెళ్లి తమ మతంలో చేరాలని బెదిరించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

# 42 'ఎర్ర' దుంగలు స్వాధీనం

-నిందితుల కోసం గాలింపు

శ్రీరంగరాజపురం: మండలంలోని పిల్లారికుప్పం సమీపంలో 42 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజకుల్లాయప్ప ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆయన కథనం.. పిచ్చాటూరు మండలానికి చెందిన రవినాయుడు అటవీశాఖ అధికారుల వద్ద నుంచి ఎర్ర చందనం చెట్లను కొనుగోలు చేసి, వాటిని డ్రెస్సింగ్ చేశాడు. వాటికి నంబర్లు వేసి, ప్రభుత్వ అనుమతులు పొందాడు. గ్రామానికి చెందిన ఓ రైతు పొలం వద్ద గోడౌన్ ఏర్పాటు ఎర్రచందనం దుంగలను అందులో ఉంచి, వాచ్‌మన్ నియమించాడు. అయితే గత నెల 23న ఆగంతకులు వాటిని అపహరించుకుపోయినట్లు రవినాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో పోలీసులు నిఘా ఉంచారు. అందిన సమాచారం మేరకు ఒక రహస్య ప్రాంతంలో పోలీసులు దాడులు చేశారు. అక్కడ దాచి ఉంచిన 42 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. దుంగలను అపహరించిన నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తామని ఎస్ఐ చెప్పారు.

# దంపతులను ఢీకొన్న మోటార్ సైక్లిస్టు

– భర్త మృతి భార్యాపిల్లలకు గాయాలు

కార్వేటినగరం: ఒక మోటార్ సైక్లిస్టు మితిమీరిన వేగం ఓ కుటుంబం పెద్ద దిక్కును బలిగొంది. ఆదివారం రాత్రి ఈ సంఘటన కార్వేటినగరంలోని పద్మసరస్సు గ్రామం వద్ద చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం... పద్మసరస్సు ఎస్టీ కాలనీకి చెందిన అయ్యప్ప(30) తన భార్య, పిల్లలతో ద్విచక్రవాహనంపై కార్వేటినగరానికి బయల్దేరాడు. చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై వస్తుండగా, కార్వేటినగరం వైపు నుంచి పుత్తూరు వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి మితిమీరిన వేగంతో వారిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అయ్యప్ప దంపతులతో పాటు పిల్లలకు కూడా తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్సులో వారిని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో అయ్యప్ప మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు అయ్యప్ప (ఫైల్)

### జూదరుల అరెస్ట్

చిత్తూరు అర్బన్ : చిత్తూరులోని టాప్‌లైన్ క్వార్టర్స్‌లో ఆదివారం వన్‌టౌన్ పోలీసులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.13,180 స్వాధీనం చేసుకున్నట్టు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

### ఆలయంలో హుండీ చోరీ

పాకాల: గుర్తు తెలియని దుండగులు ఆలయంలో హుండీని చోరీ చేసిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు దామలచెరువు రామాలయంలో గుర్తు తెలియని దుండగులు సీసీ కెమెరాలను పక్కకు పెట్టి, హుండీని పగలగొట్టి నగదును అపహరించారు. ఆదివారం ఉదయం గమనించిన స్థానికులు ఆలయంలో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.